

# మనిషి కథ

రాహుల్ సాంకృత్యాయన్

# మనిషి కథ

రచన

**రాహుల్ సాంకృత్యాయన్**

అనువాదం

**పోలు శేషగిరిరావు**

ప్రచురణ

**కావ్య పబ్లిషింగ్ హౌస్**

12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,
ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్,
గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017.
ఫోన్ : 9989599135

ప్రచురణ : నవంబరు, 2011

ముద్రణ
చరిత ఇంప్రెషన్స్
హైదరాబాద్ - 500 020.

*వెల రూ. 42/-*

# వేట

పూర్వం మనిషి కూడా కోతిలాగా ఉండేవాడు. అతడికి ధరించడానికి బట్టలుండేవి కావు. చలికాలం వస్తే చల్లని కొండలమీద నుంచి కిందికి దిగి వచ్చేవాడు. ఇది ఆ కాలంనాటి సంగతి. ఒక అమ్మ ఉండేది. ఆమెకు ఒక కొడుకూ, ఒక కూతురూ ఉండేవాళ్ళు. వాళ్ళకు ఇల్లంటూ యేమీ ఉండేది కాదు. చెట్టుకింద ఉండేవాళ్ళు. అదే వాళ్ళ ఇల్లు. వర్షంలో తడవకుండా ఉండటానికి మరే ఆధారమూ ఉండేది కాదు. తడిసిపోయేవాళ్ళు. తరువాత శరీరం ఆరిపోయేది. ఒకరోజు అమ్మ చాటుగావుండి ఒక కుందేలుకు రాయి విసిరింది. రాయి తగలడంతోనే కుందేలు కూలబడిపోయింది. అక్కడే చల్లబడిపోయింది. నిన్నటి నుంచి పిల్లలు ఆకలితో ఉన్నారని అమ్మకు తెలుసు. రాత్రిపూట కూడా యేడుస్తూనే నిద్రపోయారు. ఆమె చచ్చిపోయిన కుందేలును ఇంటికి



తీసుకొచ్చింది. అక్కడ ఆమె పిల్లలు మూమా – మూమీ నిద్రపోతూ వున్నారు. వాళ్ళను నిద్రలేపింది. వాళ్ళ ఒంటి మీద రోమాలు ఉన్నాయి కదూ! వర్షం కురిసినప్పుడే ఒళ్ళు కడుగుకొనేవాళ్ళు. అమ్మ జాగ్రత్తగా ఓవైపు నుంచి ఒక రాతికత్తిని తీసింది. ఆ కాలంలో ఇనుము, ఇత్తడి, రాగిలాంటి లోహాలు ఎక్కడా ఉండేవి కావు. ఆ కత్తి కూడా గట్టి రాతిముక్కతో తయారు చేసింది. దానికి బాగా పదును పెట్టింది.

కుందేలు చర్మం ఒలిచింది. ఒక మాంసపు ముక్కను మూమీ నోట్లో పెట్టింది. మూమా నోట్లో కూడా మాట రావడానికి సందులేకుండా ఓ పెద్ద ముక్కను కుక్కింది. ఆ కాలంలో కుందేలు మాంసాన్ని కాల్చుకొనడానికి నిప్పు ఉండేదికాదు. పచ్చి మాంసాన్ని గబగబా తినాలంటే వీలుపడదు. అంచేత మూమా – మూమీ పళ్ళ బలమంతా ఉపయోగించి నములుతూ వున్నారు. మూమీ చురుకైనది. కొంచెం నమిలి ఎలాగో మింగేసింది. అమ్మ మరో ముక్క ఇచ్చింది. మూమా కూడా మింగాలని చూశాడు. ముక్క పెద్దది కావడం చేత గొంతుకు అడ్డం పడింది. అమ్మ అతడి మెడమీద వెంటనే ఒక్కటి చరిచింది. లేకపోతే పాపం మూమా గతి ఏమై ఉండేదో! పచ్చి మాంసం కదూ! అంచేత తినడం చాలాసేపు పట్టింది. మొత్తంమీద సగం కుందేలును తిన్నారు. సగం





అట్టిపెట్టుకొన్నారు. సాయంకాలం కావచ్చింది. కొండగుహలోకి వెళ్ళమని చెపితే మూమీ కదలలేదు. అమ్మ దెబ్బ వేసింది. అప్పుడు వెళ్ళింది. గుహలోకి వెళ్ళే దారి చాలా చిన్నది. దారికి అడ్డంగా కట్టెలు గుట్టగా పడేసుకొన్నారు. గాలి వీస్తూ వుంది. చలివేస్తూ వుంది. పళ్ళు కటకటా కొట్టుకుంటున్నాయి. ముగ్గురూ గుహలోకి వెళ్ళారు. కుక్క పిల్లల్లాగా పడుకొన్నారు. రాత్రిపూట ఏనుగు ఘీంకరించేది. పాపం ముగ్గురూ భయపడిపోయే వాళ్ళు. మూమీ అమ్మ మాట వినడం మంచిదయింది కదూ!.

# నిప్పు

అనేకవేల, కాదు లక్షల సంవత్సరాలనాటి సంగతి. ఒకరోజు చున్నీ (మూమీ అమ్మ) అడవిలో నుండి బయటకు పరుగుతీసింది. అడవికి నిప్పు అంటుకొన్నది. జంతువులు కూడా పారిపోతున్నాయి. ఎక్కడో యెండిపోయిన చెట్టు కొమ్మలు గాలికి రాచుకున్నాయి. అంతే, ఆ రాపిడికి నిప్పు పడింది. మొదట ఎండుగడ్డి అంటుకొన్నది. ఎండు కట్టెలు ముట్టుకొన్నాయి. తరువాత ఇతర చెట్లు భగ్గున మండిపోతున్నాయి. పాపం జంతువులన్నీ పారిపోలేక పోయాయి. ఒక ఏనుగు కూడా తగలబడింది. ఓ పంది కూడా కాలిపోయింది.



అప్పటికి మూమా – మూమీ కొంచెం పెద్దవాళ్ళయ్యారు. మూమా ఆరేళ్ళవాడు. మూమీ యెనిమిదేళ్ళది. ఆ నిప్పు యెక్కువ రోజులు ఉండలేదు. మరుసటి రోజు కుంభవర్షం కురిసింది. అడవిలోని నిప్పు ఆరిపోయింది. కాలినల్లబడిపోయిన అడవికి ఇద్దరు పిల్లలూ అమ్మతోపాటు తిరిగి వచ్చారు. ఒకచోట ఒక పంది తగలబడి వుంది. అటువంటివి చాలా చచ్చిపడున్నాయి. లేకపోతే పెద్దపులి, చిరుతపులి, తోడేలు మూమా – మూమీని వాటిదగ్గరకు చేరనిచ్చేవా? అమ్మ నడుముకు కట్టుకొని వున్న రాతి కత్తిని చేతిలోకి తీసుకొన్నది. ఆ కత్తి పరపరా తెగుతూ పోయింది. అమ్మ రెండు పెద్ద ముక్కలు పిల్లల నోట్లో పెట్టింది. ఒక ముక్క తన నోట్లో వేసుకొన్నది. 'ఓహో! ఓహో!' అన్నది. ఆకాలం మనిషి మాటలు కూడా యెక్కువగా పలకగలిగేవాడు కాదు. అమ్మ 'ఓహో' అనడం విని మూమా – మూమీ కూడా 'ఓహో!ఓహో!' అన్నారు. అది వాళ్ళకు చాలా రుచిగా వుంది. పంది చాలా పెద్దది. దాన్ని పూర్తిగా వాళ్ళు తినలేకపోయారు. అయితే ఆరోజు చాలా తిన్నారు. ఆనందంతో అందరూ నాట్యం చేశారు. దగ్గరలోని కాలువనీరు మురికిగా వుంది. సెలయేరు యెక్కడుందో అమ్మకు తెలుసు. ముగ్గురూ అక్కడకు వెళ్ళారు. ముందు దోసిళ్ళతో తాగారు. తరువాత కోతిలాగా నీళ్ళల్లో మూతిపెట్టి తాగారు. అప్పటికి మనిషి ఇంకా



కోతిలాగానే వుండేవాడు. ఒంటిమీద బట్టలుండేవి కావు. తినడానికి, తాగడానికి పాత్రలుండేవి కావు. మట్టి పాత్రలు మచ్చుకు కూడా లేవు. ఎండ ఎక్కువయ్యేసరికి చెట్టు కిందికి చేరారు. వర్షానికి తడవకుండా ఉండడానికి అప్పుడప్పుడు యేదయినా గుహ దొరికేది. లేకపోతే తడుస్తూనే ఉండేవాళ్ళు.

ఆ పంది ఆ రోజు నిప్పులోబడి దానంతటదే తగలబడిపోయింది. మూమా, మూమీకి ఆ పంది మాంసం చాలా రుచిగా వుంది. మళ్ళీ వెళ్ళి చూశారు. అక్కడ దాని యెముకలు మాత్రమే మిగిలి వున్నాయి. అడవిలో మాంసం మీద మోజుగల జంతువులు తక్కువ వున్నాయా! నక్కలు, గుంటనక్కలు, సింహాలు, తోడేళ్ళు, చిరుతపులులు, పెద్ద పులులు లాంటివి ఎన్నో ఉన్నాయి. గుంటనక్క వచ్చి మూతిబెట్టింది. ఇంకేముంది! తోడేలు వచ్చింది. తోడేలును చూడగానే గుంటనక్క తోక ముడిచింది. లేకపోతే తోడేలు దాన్నే తినివేసేది. ఆకలి తీరిన తరువాత కూడా తోడేలు అక్కడే నాకుతూ వుంది. ఇంతలో పెద్దపులి గాండ్రిస్తూ వచ్చింది. ఆ గాండ్రింపు విని తోడేలు కాలికి బుద్ధి చెప్పింది.

ఈ జంతువులన్నీ కేవలం మాంసమే తింటాయి. కందమూల ఫలాలు ముట్టుకొనేవి కావు. మూమా – మూమీ, వాళ్ళ అమ్మా పండ్లు కూడా తినేవాళ్ళు. కోతిలాగా ఆకులు తినేవాళ్ళు. అమ్మ గబగబా పళ్ళు తిన్నది. మూమా – మూమీకి





కూడా పళ్ళు తినిపించింది. తరువాత ఆమె గుహవైపు పరుగు తీసింది. మూమా – మూమీ ఆటలలో లీనమైపోయారు. అమ్మ యేం చేసిందో వాళ్ళకు తెలియనే తెలియదు. ఇద్దరూ సుద్దమొద్దులు. ఒకలావుపాటియెండు చెట్టు ఇంకా తగలబడుతూనే వుంది. దానిని వర్షం కూడా ఆర్పలేకపోయింది. అమ్మ మండుతున్న ఒక కట్టెను గుహలోకి తీసుకుపోయింది. ఆ కట్టెమీద ఇంకా కట్టెలు వేయకపోతే అది ఆరిపోతుంది. అమ్మ చుట్టుపక్కల వున్న యెండు కట్టెలు పోగు చేసుకొని వచ్చింది. వాటిని మండుతున్న ఆ కట్టెమీద వేస్తూ వుంది.

మరుసటి రోజు యెంతో సేపు వెదికిన మీదట ఓ గుంటనక్క పిల్ల కన్పించింది. అమ్మ పిల్లల నోటికి చేయి అడ్డం పెట్టింది. అరవొద్దని సైగ చేసింది. తాను జరుగుతూ దాని దగ్గరలోకి వెళ్ళింది. గభాలున ఒక రాయి విసిరింది. గుంటనక్క పిల్ల అక్కడే వెల్లకిలబడిపోయింది. అమ్మ దాని మాంసం ఒక ముక్క కూడా యెవరికీ పెట్టకుండా గుహలోకి తీసుకు వెళ్ళింది. ఆ గుంటనక్క పిల్లను నిప్పుల మీద కాల్చింది. తిరగేసి బోర్లేసి అన్నివైపులా బాగా ఉడికేటట్లు కాల్చింది. అప్పుడు కోసి రుచి చూసింది. 'ఓహో! ఓహో!' అంది. మూమా – మూమీ కూడా ముక్కలు తింటూ 'ఓహో! ఓహో!' అంటూ వున్నారు.

ఇప్పుడెప్పుడైనా యేదయినా జంతువును వేటాడితే దాన్ని ముందు నిప్పులో కాల్చేవాళ్ళు. మూమా – మూమీకి కూడా ఇప్పుడు పచ్చిమాంసం నచ్చడంలేదు. వాళ్ళు కూడా ఎండుకట్టెలు పోగుచేసుకొచ్చి నిప్పుమీద వేస్తూ వుండేవాళ్ళు. కొండ దిగువనే గుహుంది. చలికాలంలో ఇక్కడ చలి కూడా బాగానే వేస్తుంది. అప్పుడు మంట దగ్గర కూర్చుంటే చలి లేకపోవడం చూశారు. అమ్మ నాట్యం చేస్తూ ఉంది. చేతులెత్తి నమస్కరిస్తూ వుంది. ఆహా! ఈ నిప్పు మాంసాన్ని కాల్చుతున్నది. చలిని పారగొడుతున్నది.

ఒకరోజు సింహం వచ్చింది. అమ్మ భయపడిపోయింది. ఆమె విసిరే రాయి తగిలి కుందేలు ఛస్తుంది కాని సింహం ఎక్కడ ఛస్తుంది. పిల్లలు కూడా భయంతో ఏడుస్తూ ఉన్నారు. రాత్రిపూట గదా! మంట మీద ఎండిన ఆకులూ, ఎండు కట్టెలూ పడేశారు. చుట్టూ వెల్తురు పట్టపగలులా కన్పించింది. మంటని చూసి

సింహం పారిపోయింది. ఆరోజు అమ్మకు విషయమేమిటో పూర్తిగా అర్థం కాలేదు. మంటని చూసి పెద్ద పెద్ద జంతువులు (ఏనుగులు కూడా) పారిపోతాయని ఒకరోజు తెలుసుకున్నది. అంతే, అమ్మ ఇక తెంపు లేకుండా మంటనీ, ఎండిపోయిన ఆకులనూ, ఎండు కట్టెలను నిలువచేస్తూ ఉంది.

# పెద్ద వేట

మూమా – మూమీల అమ్మ నిప్పు అవసరాన్ని తెలుసుకోవడంతో ఎంతో మంచి పని జరిగింది! ఇప్పుడు మంట వేయగానే సింహాలూ, పులులూ పారిపోతున్నాయి. మంట దగ్గర కూర్చోవడంతోనే చలి కూడా వేయడం లేదు. మాంసం లభించిన రోజు అమ్మ దాన్ని కూడా నిప్పుల్లో కాల్చుతూ వుంది. మాంసం రుచి పెరిగింది. మనుషులకు భద్రత పెరిగింది. పళ్ళకు పూర్వం కలిగినంత శ్రమ కలగడం లేదు. తరువాత నిప్పు వాళ్ళ అమ్మ వరకే పరిమితం కాలేదు. వాళ్ళు వొంటరిగా ఉండేవాళ్ళు కాదు. చిరుత పులులతో, పెద్ద పులులతో, ఏనుగులతో, సింహాలతో అడవి అంతా నిండి వుంది. అటువంటప్పుడు మనిషి ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతాడా? వాళ్ళు అప్పుడప్పుడు ఎముకలతో,





**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=2119](http://kinige.com/kbook.php?id=2119)**

* * *